క్లుప్తంగా

ఏప్రిల్ 2న ఇంటర్వ్యూలు

పాలకొండ రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 2న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం. విజయరంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుందని, దరఖాస్తుదారులందరూ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

వీరఘట్టం: యాక్టివ్‌లో లేని రేషన్ కార్డుదారులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన కార్డుదారుల వివరాలు డీలర్ల వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. కార్డుదారులు డీలర్లను సంప్రదించాలని సూచించారు.

108 సిబ్బందికి శిక్షణ

పాలకొండ: ఆపద సమయంలో ఉన్నవారిని రక్షించే చర్యలపై 108 సిబ్బందికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం శిక్షణ అందించారు. ఓజీటీ అలుబిల్లి శ్రీనివాసరావు అంబులెన్స్‌లో పనిచేస్తున్నవారికి శిక్షణ ఇచ్చారు. చిన్నపిల్లలకు వివిధ దశల్లో వచ్చే వ్యాధులు, గుండెకు సంబంధించిన సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్షణం అందించాల్సి వైద్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిరిబాబు, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా జైళ్ల శాఖాధికారి మోహనరావు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్యం పట్ల జైల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జైళ్ల శాఖాధికారి కె.మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ.. ఎండల నేపథ్యంలో ఉదయం 11 గంటలకు ఖైదీలను సెల్‌లోకి పంపాలన్నారు. అక్కడ గాలి, వెలుతురు ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ బి.జోగులును సూచించారు. అనంతరం జైల పల్సరాలు, వసతులు, రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట హెడ్‌వార్డర్ పి.చంద్రరావు, బి.విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

డిప్యూటీ వార్డెన్‌కు చార్జ్ మెమో

సీతంపేట: దోనుబాయి ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ బిడ్డిక సుబ్బారావుకు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి చార్జ్‌మెమో జారీ చేసినట్లు ఏపీఓ చిన్నబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో విద్యార్థి మృతి చెందడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తొలుత చార్జ్‌మెమో ఇచ్చినట్లు పేర్కొన్నారు.

డ్రాయింగ్ టీచర్‌ను అభినందించిన కలెక్టర్



శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

జియ్యమ్మవలస: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని కలెక్టరు కార్యాలయంలో మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావును కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. రాష్ట్ర స్థాయి డ్రాయింగ్ పోటీల్లో వరుసగా మూడేళ్ల విద్యార్థులను విజేతలుగా నిలబెట్టడంలో ఆయన చేసిన విశేష కృషికి గాను ఆయనను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు

కొమరాడ: మండలంలోని కందివలస గ్రామంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇదే శిబిరాన్ని సందర్శించిన ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవిలో వడదెబ్బ బారినపడకుండా, పలు వ్యాధులు, జ్వరాల బారినపడకుండా ప్రజలను చైతన్యం చేయాలని, వారికి సకాలంలో వైద్యసేవలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్, ఏఎంవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరలకు కాలం చెల్లింది..

- కొత్త దోమ తెరలు వచ్చేదెప్పుడో..?
- మలేరియా హైరిస్క్ గ్రామాల్లో పంపిణీ నిల్
- వ్యాప్తి చెందుతున్న దోమకారక వ్యాధులు
- ప్రతిపాదనలకే పరిమితమైన మలేరియా నివారణా శాఖ

సీతంపేట:

మన్యంలో గతంలో పంపిణీ చేసిన దోమ తెరలకు కాలం చెల్లింది. దీంతో కొత్త దోమ తెరల కోసం గిరిజన ప్రాంత వాసులు ఎదురుచూస్తున్నారు. హైరిస్క్ మలేరియా గ్రామాల్లో మలేరియా నివారణా చర్యలు సంబంధిత శాఖ చేపట్టాల్సి ఉంది. దీనిలో భాగంగా ప్రధానమైన దోమ తెరలు పంపిణీ చేయాలి. 2021లో 3.54 లక్షల దోమ తెరలు పంపిణీ చేశారు. వాటి కాలపరిమితి 2024తో పూర్తయింది. ప్రస్తుతం అవన్నీ చిరిగిపోయి, వినియోగానికి పనికిరాకుండా పోయాయి. అంతకముందు కాలం చెల్లిన దోమ తెరలు ఏవైనా ఉంటే సింథటిక్ పైరాత్రిన్ ద్రావణంలో ముంచి ఇచ్చేవారు. అవి కొంతవరకు పని చేసేవి. ఇప్పుడు అటువంటి చర్యలేవీ లేవు. ఈ ఏడాది సీతంపేట ఐటీడీఏ పరిధిలో సుమారు 4 లక్షల వరకు కొత్త దోమ తెరలు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఐటీడీఏ పరిధిలో 18 సబ్ ప్లాన్ మండలాలు ఉండగా 1156 గిరిజన గ్రామాలున్నాయి. సుమారు 2 లక్షల 50 వేల జనాభా నివసిస్తున్నారు. మలేరియా నిర్మూలనా కార్యక్రమాల్లో భాగంగా గిరిజనులకు పంపిణీ చేయాల్సిన దోమ తెరలను ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడంతో దోమల కారక వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎపిడమిక్‌తో పాటు మామూలు సమయాల్లో కూడా ఆదివాసీలు మలేరియా, డెంగీ వంటి వ్యాధులతో సతమతమవుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కొన్ని గ్రామాల్లో కాలం చెల్లిన దోమ తెరలను చేపలు పట్టడానికి, మొక్కల చుట్టూ రక్షణకు వినియోగిస్తున్నారు.



ఏరియా ఆస్పత్రిలో రోగులు (ఫైల్)

సంవత్సరం	సేకరించిన రక్త నమూనాలు	మలేరియా పాజిటివ్ కేసులు
2022	2,20,809	54
2023	2,71,903	45
2024	3,63,684	470
2025 (ఇప్పటివరకు)	60,774	72
మొత్తం	9,17,170	641



కాలం చెల్లిన దోమతెరలు

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో మలేరియా పాజిటివ్ కేసులు రోజు,రోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా దోనుబాయి, మర్రిపాడు, కుశిమి పీహెచ్‌సీల పరిధిలో అత్యధికంగా మలేరియా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ఇటీవల కాలంలో జిల్లా మలేరియా నివారణా కార్యాలయాన్ని సైతం సీతంపేటలోనే ఏర్పాటు చేసి పర్యవేక్షించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

వసతిగృహాల్లో దోమ తెరలేవీ...

ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 13 రెసిడెన్షియల్ పాఠశాలలు, మూడు గురుకుల కళాశాలలు, 18 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలున్నాయి. వీటిలో దాదాపు 20 వేల మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి కూడా దోమ తెరలు పంపిణీ చేయాల్సి ఉంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా దోమ తెరలు అందిస్తారో,లేదో చూడాలి మరి.

ప్రతిపాదనలు పెట్టాం..

దోమ తెరలకు ప్రతిపాదనలు పంపించి ఆరు నెలలైంది. త్వరలో వస్తాయనుకుంటున్నాం. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి రావాల్సి ఉంది. దాతలెవరైనా దోమ తెరలు ఇస్తే బాగుంటుంది. గతంలో పాడేరు ప్రాంతంలో స్పాన్సర్ ఇచ్చారు. అక్కడ అప్పట్లో పంపిణీ చేశాం. ఇక్కడకూడా దోమ తెరలు ఇచ్చేందుకు దాతలు ముందుకు వస్తే బాగుంటుంది.

– పీవీ సత్యనారాయణ, డీఎంఓ, సీతంపేట, ఐటీడీఏ

నేడు ఐటీడీఏ వద్ద ధర్నా



సిరికొండ గూడలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

పాలకొండ రూరల్: గిరిజన రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతంపేట ఐటీడీఏ వద్ద శనివారం ఉదయం పది గంటలకు ధర్నా చేపట్టనున్నట్లు గిరిజన సంఘ నాయకుడు ఎస్. గంగయ్య తెలిపారు. ఈ మేరకు మండలంలోని సిరికొండగూడలో శుక్రవారం పర్యటించి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడిమామిడి 80 కిలోల బస్తాకు రూ. 16 వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా పిక్కలు కొనుగోలు చేయాలని కోరారు. జిల్లా పరిధిలో సీతంపేట, కురుపాం, సాలూరు ప్రాంతాల్లో జీడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు గిరిజనులకు విద్యా. వైద్య రంగాల్లో తోడ్పాటు అందించాలని కోరారు. ఇందులో భాగంగా సాలూరు, కురుపాం, సాతంపేటలో వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే డైట్, పీజీ సెంటర్లు నెలకొల్పడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో మినీ రిజర్వాయర్లు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

- సీపీఎం నాయకులు



పాలకొండ: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: ట్రూఅప్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా.. శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజల వేస్తున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన నాయకులు ఎప్పుడెలా ట్రూఅప్ చార్జీలు వేస్తారని ప్రశ్నించారు. 2024 – 25 సంవత్సరానికి గాను 9,412 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట వసూలు చేయనున్నారని ఆరోపించారు. వెంటనే చార్జీలు తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎ. లక్ష్మణరావు, దూసి దుర్గారావు, కాద రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: విద్యుత్ బిల్లులు దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు సిద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారావమ్మ అన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కన్నయ్యగూడలో శుక్రవారం నిరసన చేపట్టారు. విద్యుత్ బిల్లులు దహనం చేసి, ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మండంగి రమణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎస్.కొత్తగూడలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, పెదమేరంగి-2, జోగిరాజుపేట ప్రాంతాల్లో రెండు అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు, గానలిలోని మినీ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు అర్హత తెలిపే సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి, ఏప్రిల్ 4వ తేదీలోగా కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయలో అందజేయాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై వివాహం జరిగి, స్థానిక నివాసులై, 01.07.2024 నాటికి 35 ఏళ్లలోపు వయసు కలిగిన మహిళలు ఈ పోస్టులకు అర్హులన్నారు.

సీతంపేట: మండలంలో రాజుగాడిగూడ, వెంపలగూడలలో రెండు మినీ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పి.రంగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన వివాహితులై పదో తరగతి పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వారు వచ్చే నెల నాలుగో తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న బ్యాంకు లింకేజీ యాంకర్ పర్సన్ శివున్నాయుడు

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం కావాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి అన్నారు. మండలంలోని నవిరి గ్రామంలో వీవో ఏలు, ఎన్యుమరేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధుల ప్రణాళికల తయారీపై శుక్రవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి 10 మహిళా సంఘాలకు ఓ సీఆర్‌టీని ఎంపిక చేయడం జరుగుతుందని, సీఆర్‌టీల ద్వారా జీవనోపాధుల కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందన్నారు. సంఘాల సభ్యుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. బ్యాంకు లింకేజీ యాంకర్ పర్సన్ శివున్నాయుడు మాట్లాడుతూ మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేసి వారితో చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేలా చూడాలన్నారు. మహిళలు కూడా ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన రైతులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు చేయాలని ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చిరంజీవి, సూర్యం, ఊర్మిళలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారంతా మండల పరిధిలోని తాడికొండ, పెదఖర్జ, ఇరిడి, రాయగడ జమ్ము పంచాయతీల గిరిజన రైతులతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. పలువురు గిరిజన రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న కొండపోడు భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్, డీకేటీ పట్టాలు ఇవ్వకపోవడంతో వారంతా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటికైనా సర్వే చేసి పట్టాలు ఇస్తే రైతులకు న్యాయం చేసినవారమవుతామన్నారు. అనంతరం తహసీల్దారు ఎస్.శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆలయ భూముల ఆక్రమణలపై విచారణ



విచారణ చేపడుతున్న తహసీల్దారు బాల

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణపై తహసీల్దారు పి.బాల శుక్రవారం విచారణ చేపట్టారు. ఆలయానికి సంబంధించిన స్థలాలను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని ఇటీవల పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆక్రమణకు గురైన ప్రదేశాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆక్రమణలపై భక్తులు, దాతలు అభిప్రాయాలను సేకరించారు. ఆలయ పరిధిలో నిర్వహిస్తున్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకుకు వసతులు కల్పించాలని, మూలన పడేసిన హుండీలు తిరిగి ఏర్పాటు చేయాలని, ఆలయానికి విరాళమిచ్చిన 0.44 సెంట్ల భూమిని సబ్‌డివిజన్ చేయాలని మహిళలు కోరారు. అనంతరం ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు డి.పారినాయుడు, ఎం. వాసుదేవరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు దరఖాస్తుల పరిశీలన

భామిని: బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ కొండపల్లి సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పాస్టర్ ప్రవీణ్ పగడా ల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ కురుపాం మండల ప్రెసిడెంట్ మీసాల శోభన్‌బాబు కోరారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన దైవసేవకుడు ప్రవీణ్ మరణం అనుమానాస్పదంగా ఉందని, ఆయనది ప్రమాదం కారణంగా జరిగిన మరణం కాదని, ఎవరో ఆయనను హత్య చేసినట్లుగా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఆయన మరణం యావత్తు క్రైస్తవ లోకానికి విషాదకరమన్నారు. కొంతకాలంగా ఆయన తనకు ప్రాణహాని ఉందని చెప్పారని, ఈ క్రమంలో ఆయన మృతి చెందడం చూస్తే ఆయనది హత్యేనన్న అనుమానానికి బలం చేకూరుస్తోందన్నారు. త్వరితగతిన విచారణ చేపట్టి, నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

16 మందిపై బైండోవర్ కేసులు

సీతంపేట: సారా నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గతంలో సారాతో పట్టుబడిన 16 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై ఆర్.జైభీమ్ తెలిపారు. ఈ మేరకు నిందితులను శుక్రవారం స్థానిక తహసీల్దార్ అప్పలరాజు ముందు హాజరు పరిచామన్నారు. సంవత్సర కాలానికి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశామన్నారు. మరోసారి నేరం చేసినట్లయితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని అధికారులు స్పష్టం చేశారు.

శతశాతం ప్రవేశాలకు కృషి చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల శతశాతం ప్రవేశాలకు కృషి చేయాలని ఏపీ ఆదర్శ పాఠశాలల స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కె.ధర్మకుమార్ సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన.. 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలలోని ఆరో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఖాళీ సీట్లన్నీ భర్తీ అయ్యేలా చూడాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందివ్వడంతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని తెలిపారు.

కేజీబీవీలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి, సీఆర్‌పీ వెంకటలక్ష్మి

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి తెలిపారు. సీఆర్‌పీ వెంకటలక్ష్మితో కలసి వచ్చిన దరఖాస్తులను శుక్రవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆరో తరగతిలో 40 సీట్లు, ప్రథమ ఇంటర్‌లో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. అర్హులైన బాలికలు ఏపీ కేజీబీవీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, లేనిపక్షంలో నేరుగా కేజీబీవీకి వచ్చి సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 11 చివరి తేదీ అని తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300

గరుగుబిల్లి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని సంతోషపురం, తోటపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీవో గౌరీనాథ్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి..



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ ఆవరణలో గిరిజనులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 358 మంది రైతులకు ఇప్పటివరకు సబ్సిడీపై ఆయిల్ ఇంజిన్లు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్‌వీ గణేష్, ఏపీడీ సన్యాసిరావు, హెచ్‌ఓ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

వెంకన్న ఆదాయం రూ.1.85 లక్షలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ.1,85,042లు నగదు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. అలాగే శ్రీకోదండరామాలయ హుండీల్లోని కానుకలు లెక్కించగా మొత్తం రూ.12,093లు నగదు వచ్చిందని పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం)లో సేంద్రియ ఎరువుల వాడకంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎస్.ధ్రువ.. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పంటల సాగులో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను శాస్త్రవేత్త ఎస్.స్రవంతి వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు..

- ఎమ్మెల్యే జయకృష్ణకు వినతి పత్రం అందజేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



ఎమ్మెల్యేకు వినతి ఇస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

సీతంపేట: మండలంలోని ఏ పని ప్రారంభించినా, పథకాలు అమలు చేసినా సంబంధిత అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం స్థానిక వైటీసీలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దోనుబాయి ఎంపీటీసీ సభ్యుడు గేదెల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మండలంలో 53 సర్పంచ్‌లు, 15 మంది ఎంపీటీసీ సభ్యులుండగా అభివృద్ధి పనులు, కార్యక్రమాలకు ఆహ్వానాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ పనులు మంజూరైనా, బిల్లుల చెల్లింపులైనా సర్పంచ్‌ల ద్వారా జరిగేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ ద్వారా జరిగిన పనులు ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగేలా చూడాలని కోరగా.. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని స్పష్టం చేశారు. వేరుశనగ విత్తనాల నుంచి మొలకలు రాలేదని ఎంపీపీ ఆదినారాయణ సభ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో వ్యవసాయ పరికరాలపై 90 శాతం సబ్సిడీ ఉంటే, ప్రస్తుతం 50 శాతం మాత్రమే ఉందని దోనుబాయి సర్పంచ్ కె. వెంకునాయుడు తెలియజేయగా... వ్యవసాయశాఖ మాత్రమే సబ్సిడీ ఇస్తోందని ఏఓ మన్మధరావు తెలిపారు. అనంతరం తాగునీరు, గృహనిర్మాణం, హార్టీకల్చర్, ఇంజినీరింగ్ పనులపై చర్చ జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, ఎంపీడీఓ గీతాంజలి, ఏడీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీవిద్య, పశువైద్యాధికారి ఆర్.శంకరరావు, ఇంజినీరింగ్ ఏఈ నాగభూషణరావు, హెచ్ఓ జయశ్రీ, ట్రాన్స్‌కో ఏఈ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పవిత్ర రంజాన్ పురస్కరించుకుని, కురుపాం మండల కేంద్రంలోని శివన్నపేట జామియా మసీదులో ముస్లిం సోదరులకు మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులు శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. మొత్తం 55 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేసి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండగ అందరికీ సుఖసంతోషాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.